క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



నగదు అందజేస్తున్న పోలయ్య దంపతులు

పెళ్లకూరు: చిల్లకూరు దళితకాలనీలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు పసల పోలయ్య దంపతులు మంగళవారం రూ.50 వేలు నగదు విరాళంగా అందజేశారు. కాలనీలో నూతనంగా శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణం చేపట్టారు. దీంతో పోలయ్య దంపతులు స్థానిక సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి ఆధ్వర్యంలో నగదును గ్రామ పెద్దలకు అందజేశారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



చెత్తా చెదారం తొలగిస్తున్న విద్యార్థులు

రాపూరు: మండలంలోని బొజ్జనపల్లి సమీపంలో ఉన్న వెటర్నరీ పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం కళాశాల ఆవరణలో శ్రమదానం చేశారని ప్రిన్సిపల్ ఇందిర తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు చెత్తా చెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శ్రీహరి, విశాలి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దొరవారసత్రం: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 17వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20వ తేదీన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు స్థానిక గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 98665 59644, 79895 64344 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వెంకటగిరి: పట్టణంలోని మహాత్మాగాంధీ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు 'గ్రంథాలయాలు – ఉపయోగాలు' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి అంజయ్య మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాపూరు: మండలంలోని వెలుగొను గ్రామంలో ఇద్దరికి చెందిన గడ్డివాములు మంగళవారం దగ్ధమైనట్లు అగ్నిమాపక అధికారి కుప్పయ్య తెలిపారు. అగ్నిమాపకశాఖాధికారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నారపరెడ్డికి చెందిన 300 గడ్డి మోపులు, వెంకటరెడ్డికి చెందిన 100 గడ్డిమోపులతో వేసిన వాములకు నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి వాములు కాలిపోయాయి. ఈ సంఘటనలో సుమారు రూ.48 వేల ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖాధికారి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కిట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

డక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని గూడూరు డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. డక్కిలిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉన్న జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 3,770 మంది విద్యార్థులందరికీ ఈ నెల11వ తేదీ లోపు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి విద్యార్థీ ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరునాళ్ల చూతము రారండి!

- చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
- సాంస్కృతిక కార్యక్రమాలకు సినీ ప్రముఖులు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్చిలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వేదిక, రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణ తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి అమ్మవారి ఉత్సవాలు, సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలివీ..

ఈ నెల 8వ తేదీన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బలిహరణ, సుడిమాను ప్రతిష్ట నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు తిరునాళ్ల ప్రారంభం అవుతుంది. రాత్రి చెంగాళమ్మ చరిత్ర నృత్యరూపకాన్ని టీటీడీ కళాకారులు ప్రదర్శిస్తారు. తొలిరోజు ముఖ్యఅతిథిగా సినీ హీరోయిన్ సురభి విచ్చేయనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్ రేణుకుమార్ చే సంగీత విభావరి, ఫోక్ సింగర్ పల్సర్ బైక్ రమణ, కళాంజలి ఆర్కెస్ట్రా, జబర్దస్త్ సునామీ సుధాకర్ బృందం చే హాస్యవల్లరి, కొరియోగ్రాఫర్ ఢీపేమ్ అభిమాస్టర్ బృందం ఆధ్వర్యంలో డాన్స్‌లు ఏర్పాటు చేశారు.

- 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుళ్లు ఉత్సవం, అనంతరం అమ్మవారి అశ్వవాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమంలో సినీ ప్లేబ్యాక్ సింగర్స్ మోహన భోగరాజ్, సుమంత్, తెలంగాణా ప్రఖ్యాత ఫోక్ సింగర్ కనకవ్వచే సంగీత విభావరి, బుల్లెట్ భాస్కర్ బృందం చే జబర్దస్త్ కామెడీ షో, రమేష్ మాస్టర్, పల్సర్ బైక్ ఝాన్సీ బృందం నృత్యం, కొరియోగ్రాఫర్ ఢీఫేమ్ పండు మాస్టర్ చే డాన్స్ తోపాటు సినీ యాంకర్ శైలజవర్మ యాంకర్ వ్యవహరించి పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు

- 10వ తేదీ సాయంత్రం సుళ్లు ఉత్సవం, రాత్రి 9 గంటలకు మహిషాసురమర్దిని (యుద్ధం), అనంతరం అమ్మవారి సింహవాహన సేవ నిర్వహించనున్నారు. మహిషాసుర మర్దిని కార్యక్రమంలో భారీ ఎత్తున బాణ సంచా వేడుకలను నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శివమణి చే డ్రమ్స్ వాయిద్యం, సినీ హీరోయిన్ మన్నార చోప్రా విచ్చేయనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్ కీర్తనశర్మ, సాయిశిల్ప, ఫోక్ సింగర్ తేలు విజయ, శక్తి ఈవెంట్స్ వారిచే సంగీత కచ్చేరి, బుల్లెట్ భాస్కర్ బృందం జబర్దస్త్ కామెడీ షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సినీ యాంకర్ శ్యామల యాంకర్‌గా వ్యవహరించనున్నారు.
- 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుళ్లు ఉత్సవం, రాత్రి 9 గంటలకు నంది వాహన సేవ నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సినీ హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్ ప్రత్యేక ఆకర్షణగా తీసుకొస్తున్నారు. జీ తెలుగు సరిగమప బృందం సినీ ప్లేబ్యాక్ సింగర్స్ శివ, సాయిచరణ్, శివానీ, శ్రీకాంత్, శృతిక, సన్విద్, హాని, కోరస్ సింగర్స్ గాయత్రి, శ్రావణి, వంశీ, హర్షిత్, ఫోక్ సింగర్ మౌనిక సంగీత విభావరి నిర్వహించనున్నారు. నూకరాజు బృందంచే జబర్దస్త్ కామెడీషో, సాగర్ మాస్టర్ బృందంచే డాన్స్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు సినీ యాంకర్ ఐశ్వర్య యాంకరింగ్ చేయనున్నారు.
- 12వ తేదీ సాయంత్రం 7 గంటలకు చెంగాళమ్మ తల్లి కాళంగినదిలో తెప్పపై విహరించనున్నారు. రాత్రి 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. తెప్పోత్సవం తరువాత బాణసంచా వేడుకలను ఘనంగా జరపనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జీ తెలుగు సరిగమప బృందం సినీ ప్లేబ్యాక్ సింగర్స్ గీతామాధురి, ఎస్ఎస్‌వీ ప్రజ్ఞ, వాగ్దేవి, జేపీ తదితరుల చే పాట కచ్చేరి, సత్యం మాస్టర్ బృందం చే డాన్స్‌లు తదితర కార్యక్రమాలకు సినీ యాంకర్స్ నందిని, సురాగ్ యాంకరింగ్ చేయనున్నారు.
- 13వ తేదీ రాత్రి 9 గంటలకు అమ్మవారికి శయన సేవ, అనంతరం రాత్రి 10 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సినీ హీరోయిన్ నేహా శెట్టి, సినీ యాంకర్ స్వాతి యాంకర్‌గా వ్యవహరించనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్స్ ధనంజయ్, సమీరా భరద్వాజ బృందం చే పాటకచ్చేరి, తెలంగాణా ఫోక్ సింగర్ పద్మశ్రీ మొగిలయ్యతో పాటకచ్చేరి, గల్లీబాయ్స్ సద్దాం బృందం చే హాస్యవల్లరి, డాన్స్ మాస్టర్ చిట్టి బృందం, జూనియర్ చిరంజీవి (కరీముల్లా) డాన్స్ బృందం చే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.
- 14వ తేదీ రాత్రి 9 గంటలకు అమ్మవారికి పుష్పపల్లకిసేవ నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ముగింపులో భాగంగా 'వీరసింహారెడ్డి' సినిమా హీరోయిన్ హనీరోజ్ విచ్చేయనున్నారు. సినీ ప్లేబ్యాక్ సింగర్స్ కీర్తనాశర్మ, స్థానికంగా ఉన్న స్వర గోపురం ఆర్కెస్ట్రా బృందం చే పాట కచ్చేరి, వెంకీ మంకీ బృందం, ఢీఫేమ్ సుదర్శన్ బృందం చే నృత్య ప్రదర్శనలు, సాయి హేమంత్ చే నాశికా వేణుగానం కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

వెంకటగిరికి చేరిన జాతా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటగిరి: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిందూపురం నుంచి బయలుదేరిన జాత మంగళవారం వెంకటగిరి చేరుకుంది. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య, మండల అధ్యక్షురాలు మంజులమ్మ, నాయకులు లీలావతి, టి సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, పి మణి, మోహన్, హరిబాబు, వి పెంచలయ్య, లక్ష్మమ్మ,ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు సత్కారం



డీఎంను సత్కరిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

వెంకటగిరి: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పని చేస్తూ కుప్పం డిపోకు బదిలీపై వెళుతున్న డీఎం పెంచలయ్యను నేషనల్ మజ్దూర్‌యూనియన్ నేతలు మంగళవారం డిపో కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎన్ఎంయూ డిపో కార్యదర్శి కేవీ రత్నం మాట్లాడుతూ డీఎం పెంచలయ్య కార్మికుల సమస్యల పరిష్కారించేందుకు కృషి చేశారని తెలిపారు. ఇక పలమనేరు డిపో నుంచి వెంకటగిరి డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చిన రామకృష్ణకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

క్రమబద్ధీకరణ హర్షణీయం

వెంకటగిరి: రాష్ట్రంలో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించడం హర్షణీయమని ఏపీ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి పి విజయకుమార్ తెలిపారు. వెంకటగిరిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు చెప్పిన మాట తప్పకుండా నేడు ఆ దిశగా చర్యలు తీసుకుని వేలాదిమంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఆయనకు తమ కుటుంబాలు రుణపడి ఉంటాయని తెలిపారు.

సుబ్రమణ్యంస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో సుబ్రమణ్యంస్వామి

వెంకటగిరి: పట్టణంలోని కై వల్యానది సమీపంలోని సుబ్రమణ్యంస్వామివారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛారణాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవ కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని. పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

భూముల ధరలు తగ్గించాలి



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోట: భూముల ధరలు తగ్గించాలని కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల రైతులు సబ్ రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు చేరుకుని, ప్రభుత్వం భూములకు 20 శాతం రిజిస్ట్రేషన్ విలువ పెంచుకునే అవకాశం కల్పిస్తే కోటలో అందుకు విరుద్ధంగా 60 శాతం ఎందుకు పెంచారని సబ్ రిజిస్ట్రార్ ప్రవీణాదేవిని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో రైతులపై అదనపు భారం పడుతుందన్నారు. భూముల ధరల పెంపు నిర్ణయాన్ని పునఃపరిశీలించి, తరువాత నిర్ణయం తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, షనీల్ రెడ్డి, నాగూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పగడాలపల్లి దళితులు

గూడూరురూరల్: తమ గ్రామానికి చెందిన శ్మశాన భూమిని మిథాత్మకూరుకు చెందిన అగ్రకులస్తులు ఆక్రమించారని మంగళవారం పగడాలపల్లి అరుంధతీయవాడ గ్రామస్తులు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ తమకు సంబంధించిన 30 సెంట్ల భూమిని చాలా ఏళ్లుగా శ్మశాన భూమిగా వినియోగించుకుంటున్నామని చెప్పారు. అయితే మిథాత్మకూరుకు చెందిన కొంతమంది అగ్రకులస్తులు ఆక్రమించి, చదును చేస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లునాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీ బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట: స్థానిక జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేజే ప్రకృతికుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వెంకటగిరి కోర్టు నుంచి ఆయన సూళ్లూరుపేట కోర్టుకు బదిలీపై వచ్చారు. ముందుగా చెంగాళమ్మను దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆయన ఏపీపీగా పదవీ బాధ్యతలను తీసుకున్నారు.

ఘనంగా కామ్రేడ్ చంద్ర జయంతి

గూడూరు: సీపీఐ కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్ ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శశికుమార్, రమేష్, చంద్రయ్య, మహేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

చిన్నారులకు చిన జీయర్ స్వామి ఆశీర్వాదం



చినజీయర్ స్వామితో చిన్నారులు, మల్లిక

గూడూరు: కలువాయి మండలం రాజుపాళెం సమీపంలోని పరమానంద ఆశ్రమంలో జరిగిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన నృత్యప్రదర్శనలో ప్రతిభ చూపిన గూడూరు చిన్నారులను త్రిదండి చిన జీయర్‌స్వామి మెచ్చుకుని, ఆశీర్వదించారు. ఆశ్రమంలో గూడూరుకు చెందిన శివలలిత భరత నాట్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన నృత్య పోటీల్లో నృత్య శిక్షకురాలు పిండి మల్లిక శిష్యులు సుహర్షిణి, ప్రజ్ఞ, మితిన్, శ్రీనివాస్, ప్రియాంక, అమృత, అమూల్య, మోక్ష, శ్రీషమిత్ర, భవిష్య, అరశీధార, దాన్వి, కారుణ్య, గగన, ఐశ్వర్య, మనస్విని చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుందని మల్లిక తెలిపారు.

డెయిరీలో వ్యర్థాల కాంట్రాక్ట్ వివాదంపై విచారణ

చిల్లకూరు: మండలంలోని ఓ డెయిరీలోని వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు తీసుకున్న ఓ వ్యక్తి మరో వ్యక్తికి దానిని అప్పగించే విషయంలో తలెత్తిన వివాదంపై తిరుపతి జిల్లా అట్రాసిటీ డీఎస్పీ నాగసుబ్బన్న మంగళవారం విచారణ జరిపారు. ఈ ఏడాది జనవరిలో చిల్లకూరు పోలీస్ స్టేషన్లో ఈ విషయమై కేసు నమోదు అయ్యింది. ఈ కేసును అట్రాసిటీ డీఎస్పీ నాగసుబ్బన్న మంగళవారం ముందుగా పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. అనంతరం వివాదం నెలకొన్న ప్రాంతమైన డెయిరీలో విచారణ చేసేందుకు వెళ్లారు. అయితే డెయిరీ ప్రతినిధులు ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో వారు అందుకు అభ్యంతరం తెలియజేస్తూ పోలీసులు విచారణ అంటే ఇబ్బందికరంగా ఉంటుందని, కేసుకు సంబంధించిన కాంట్రాక్టర్‌ను మాత్రమే బయటకు పంపి విచారణ చేసుకునేందుకు వీలు కల్పించారు.

రూ.2 లక్షల విరాళం

తడ: మాంబట్టులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న అన్నపూర్ణ అన్నదాన ట్రస్టుకు సూళ్లూరుపేటకు చెందిన లాయర్ తిరుమూరు సుధాకర్‌రెడ్డి భార్య సుజాతమ్మ రూ.2 లక్షల నగదు విరాళంగా అందజేశారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, అన్నదాన ట్రస్ట్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



విన్నమాలలో ఎమ్మెల్యే సంజీవయ్యకు గజమాలతో స్వాగతం పలుకున్న నాయకులు, స్థానికులు

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం విన్నమాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు వారు పొందిన సంక్షేమ పథకాలను గురించి తెలిపే బుక్‌లెట్‌లను అందజేశారు. స్థానికులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్లో కొన్ని అధికారులతో మాట్లాడి, పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, నాయకులు వేణుంబాక లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్లు రాయపు సరితా, పాలేటి నాగార్జున, విన్నమాల గోపాలయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంటక రమణారెడ్డి, కే రాజారెడ్డి, ఓ కిషోర్ యాదవ్, కే మాధవరెడ్డి, బీ మల్లికార్జున రెడ్డి, కే జయ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి



ఇరిగేషన్ అధికారులతో కలిసి దూదలకాలువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పెద్ద చెరువుకు సాగునీరందించే ప్రధాన కాలువైన నాయుడు కాలువలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు, పూడికతీత పనులు ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఆదేశించారు. మంగళవారం ఆయన పట్టణంలోని వంకిన గుంట, నాయుడుకాలుకట్ట, దూదలకాలువలను ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్‌లతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నాయుడుకాలువ పూడిపోయి, పిచ్చి మొక్కలతో నిండి ఉందన్నారు. వాటిని తొలగించి, పూడిక తీత పనులు ప్రారంభించాలన్నారు. అలాగే పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట నాయకులకు అన్నం మురళి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రికెట్, హాకీ, వాలీబాల్‌తోపాటు వాకింగ్ చేస్తున్న విద్యార్థులు, యువకులతో ఆయన మంగళవారం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు అందరూ కృతనిశ్చయులు కావాలన్నారు. అలాగే మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని వారికి సూచించారు.

ఏడీఏ బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట రూరల్: స్థానిక వ్యవసాయ సంచాలకులుగా గుమ్మడి అనిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏడీఏ నాగరాజు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నెల్లూరులో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న అనిత బదిలీపై ఇక్కడకు వచ్చారు.

వీఆర్వోపై దాడి అమానుషం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి):విధి నిర్వహణలో ఉన్న బాలాయపల్లి మండలం రామాపురం వీఆర్వో మేకలయ్యపై దాడికి పాల్పడడం అమానుషమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి కోరారు. వీఆర్వోపై దాడి ఘటనను ఖండిస్తూ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న వీఆర్వోపై దాడికి పాల్పడడం సమంజం కాదన్నారు. అధికారులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు.

భార్యపై దాడి చేసిన కేసులో భర్త అరెస్టు

నాయుడుపేటటౌన్: నగదు కోసం తరుచూ భార్య వేధిస్తూ దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడైన భర్తను మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన మన్నారు సుధకు అనూప్‌కుమార్‌తో 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారంలో అనూప్‌కుమార్ అప్పులపాలై తరచూ ఇంట్లో వస్తువులను అమ్మేస్తుండడంతో భార్య సుధ అడ్డుకునేది. దీంతో వారి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీ భార్యతో గొడవకు దిగిన అనూప్‌కుమార్ ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలు ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ జరిపి, నిందితుడు అనూప్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీ



వేపినాపిలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



డక్కిలి: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రాపూరు: మండలంలోని వేపినాపిలో మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ఆరోగ్యకేంద్ర సిబ్బంది ర్యాలీ చేశారు. వైద్యులు సూర్యధర్మేంద్ర మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ చేరితే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వైద్యులు సుదర్శనమ్మ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రత అవసరం

డక్కిలి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని డక్కిలి పీహెచ్‌సీ వైద్యాధికారి బిందు ప్రియాంక తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పీహెచ్‌సీలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ దోమతెర వినియోగించాలన్నారు. అనంతరం దోమలపై దండయాత్ర చేద్దాం– దోమతెరలను వాడుదాం అంటూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శివరామకృష్ణయ్య, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఎంపీహెచ్ఎస్‌లు ఆదిలక్ష్మి, లీలమ్మ పాల్గొన్నారు.

వైభవంగా పొన్నియమ్మన్ జాతర



పొన్నియమ్మన్ ఆలయం వద్ద జాతరలో పాల్గొన్న భక్తులు

తడ: ఇరకం దీవిలో ఉన్న పొన్నియమ్మన్ ఆలయంలో జాతర వైభవంగా సాగుతోంది. ఐదేళ్లకొకసారి నిర్వహించే ఈ జాతర సందర్భంగా ఆలయం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలోని అన్ని ఇళ్లు బంధు మిత్రులతో కళకళలాడుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి రథోత్సవం ప్రారంభం కానుంది. జాతర సందర్భంగా గ్రామం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాణ సంచా వేడుకలు నిర్వహిస్తున్నారు.

నాయుడుపేటకు చేరిన ప్రచార జాత



నాయుడుపేటలో ప్రచార జాత ర్యాలీ

నాయుడుపేటటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం చేపట్టిన రాష్ట్ర ప్రచార జాత మంగళవారం నాయుడుపేటకు చేరింది. పట్టణంలోని సందరర్ రామిరెడ్డి భవన్ నుంచి గడియారం సెంటర్ వరకు మున్సిపల్ కార్మికులు,ఇతర కార్మిక సంఘల నాయకులతో కలసి ర్యాలీ చేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ జాతలో సీఐటీయూ నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ముకుందా, మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు నాగేంద్ర, నాగరాజు, గోపి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.